## అశ్లీల సినిమాలకు బెనిఫిట్ షోలా?

- సందేశాత్మక చిత్రాలను ప్రోత్సహించాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): సినీప్రముఖులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. టికెట్ల ధరలు పెంచుకునేందుకు అనుమతిస్తే బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సహించినట్టేనని అభిప్రాయం వ్యక్తంచేశారు. ప్రభుత్వం ప్రజలపై భారం మోపకుండా చూడాలని కోరారు. సందేశాత్మక, వినోద్మాత్మక చిత్రాలకు ప్రోత్సాహకాలివ్వాలని, నేరాలు, అశ్లీలతతో కూడిన సినిమాలకు బెనిఫిట్ ఎందుకు చేయాలని ప్రశ్నించారు. సినిమా హీరోలు రోడ్ షోలు చేయడం ఎందుకని నారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో బాధిత కుటుంబానికి రూ.2 కోట్లు కాదు ఐదు కోట్లిచ్చినా పోయిన ప్రాణం తిరిగిరాదని చెప్పారు.

## పూర్తి పరిష్కారానికి 'సోఫా చేరాల్సిందే'

- అంబటి రాంబాబు ట్వీట్‌పై ఆసక్తికర చర్చ

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఏపీ మాజీమంత్రి, వైసీపీ సీనియర్‌నేత అంబటి రాంబాబు చేసిన ఓ ట్వీట్ ఇప్పుడు సంచలనంగా మారింది. 'పూర్తి పరిష్కారానికి సోఫా చేరాల్సిందే..!' అంటూ ఆయన పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. సోఫా పంపడం అనేది ఇటీవల పుష్ప-2 సినిమాతో పాపులర్ అయింది. తనకు వ్యతిరేకంగా ఉన్న వాళ్లను దారికి తెచ్చుకునేందుకు, అనుకూలంగా పనిచేసేవాళ్లకు బహుమానంగా సినిమాలో అల్లు అర్జున్ పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టిన 'సోఫా' పంపిస్తుంటారు. ఇప్పుడు అంబటి రాంబాబు పూర్తి పరిష్కారానికి "సోఫా" చేరాల్సిందే అని ఏ ఉద్దేశంతో అన్నారు? ఎవరిని ఉద్దేశించి అన్నారు? అనే అంశంపై ఎక్స్ వేదికగా చర్చ నడుస్తున్నది. కొందరు 'సోఫా' పంపితేనే సినీఇండస్ట్రీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందంటూ వ్యాఖ్యానించారు. 'పుష్ప వివాదానికి.. పుష్పరాజ్ తరహాలోనే పరిష్కారమా?' అంటూ మరి కొందరు కామెంట్లు చేస్తున్నారు.

# సినిమా పరిశ్రమపై సెస్!

**యంగ్ ఇండియా స్కూళ్ల కోసం వసూలు**

- ప్రతిపాదనకు చిత్రపరిశ్రమ సహకరించాలి
- సినీరంగ సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం
- సినీప్రముఖులతో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సినీప్రముఖులతో సీఎం సమావేశం కొనసాగుతుండగా ఓ వ్యక్తి కమాండ్ కంట్రోల్ సెంటర్ ముందు హడావుడి చేశాడు. 'సినీ పెద్దలతో కాదు.. గద్దలతో సమావేశం అవుతున్నారు' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. హీరోలు, దర్శకులు, నిర్మాతలే కాకుండా అన్నివర్గాల నుంచి ప్రతినిధులను పిలిపించుకొని మాట్లాడాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): సినీపరిశ్రమ నుంచి ప్రభుత్వం సెస్ వసూలు చేయనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క స్పష్టంచేశారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్ల నిర్మాణం జరుగుతన్నదని, వీటి ఖర్చు కోసం సినిమా పరిశ్రమపై సెస్ వేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సినీప్రముఖులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన, సినిమా అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీన, దళిత, మైనారిటి విద్యార్థుల కోసం ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున సుమారు రూ.200 కోట్లతో 119 స్కూళ్ల నిర్మాణం జరుగుతున్నదని వివరించారు. సినీపరిశ్రమ నుంచి కొంత సెస్ రూపంలో వసూలు చేసి ఆర్థిక వనరులు సమకూర్చాలని భావిస్తున్నామని చెప్పారు. ఇదొక గొప్ప కార్యక్రమమని, సినీపరిశ్రమ సహకరించాలని కోరారు. సినీరంగ సమస్యలను పరిష్కరించేందుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. టికెట్ ధరల పెంపు, బెనిఫిట్ షోలపై చర్చించి మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకోవాలని సీఎం, డిప్యూటీ సీఎం సూచించారు. పరిశ్రమ పురోభివృద్ధి, సానుకూల వాతావరణం ఏర్పాటుకు సినీ పరిశ్రమ వైపు నుంచి కూడా ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

### ఇప్పుడున్న హీరోలు నా ముందు ఎదిగినవాళ్లే

గతంలో సినిమా స్టూడియోలకు స్థలాలు, నిర్మాణాలు, నివాస స్థలాలు, ఫిల్మ్‌నగర్, చిత్రపురి కాలనీ, కార్మికులకు ఇండ్లు, ఇతర సౌకర్యాలు కాంగ్రెస్ ప్రభుత్వాలే ఇచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తామని, సినిమా పరిశ్రమను ప్రోత్సాహించడమే తమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఇప్పుడున్న హీరోలంతా తన ముందు ఎదిగినవారేనని, ఎవరో ఒకరు తన పేరు మర్చిపోతే ఎందుకు ఫీలవుతానని వ్యాఖ్యానించినట్టు సమాచారం. తన స్థాయి అలాంటిది కాదని, ఆ ప్రచారాన్ని ఖండించాల్సిన బాధ్యత టాలీవుడ్ ప్రముఖులకు లేదా? అని ప్రశ్నించినట్టు తెలిసింది. ముఖ్యమంత్రిగా చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత తనపై ఉన్నదని, వ్యక్తిగతంగా ఎవరిమీదా రాగద్వేషాలు లేవని చెప్పినట్టు సమాచారం. అవసరమైతే 'మా' అసోసియేషన్‌కు స్థలాలు ఇస్తామన్నట్టు తెలిసింది. సమావేశంలో నాగార్జున, వెంకటేశ్, కల్యాణ్ రామ్, అల్లు అరవింద్, సురేశ్‌బాబు, నవీన్, డీవీవీ దానయ్య, చినబాబు, రాఘవేంద్ర రావు, హరీశ్‌శంకర్, త్రివిక్రమ్, కొరటాల శివ, బోయపాటి శ్రీను, వీరశంకర్, సిద్దు జొన్నలగడ్డ, వరుణ్‌తేజ్, సాయిదుర్గాతేజ్, బలగం వేణు, శివబాలాజీ సహా 60మంది సినీప్రముఖులు పాల్గొన్నారు.

### అదనపు షోలు లేకపోతే ఖర్చులు రావు: మురళీమోహన్

ప్రపంచ స్థాయి సినిమాలు తీయాలంటే భారీగా ఖర్చు పెట్టాల్సి ఉంటుందని సీనియర్ నటుడు మురళీమోహన్ చెప్పారు. ఆ మొత్తాన్ని మళ్లీ వారంరోజుల్లోనే రాబట్టుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకోసం టికెట్ల ధరల పెంపు, అదనపు షోలు తప్పవని స్పష్టంచేశారు. సంధ్య థియేటర్ ఘటన బాధించిందని తెలిపారు. ఎన్నికల ఫలితాల రోజు మాదిరిగానే సినిమా విడుదలైన మొదటిరోజు ఉంటుందని వివరించారు. సినిమా విడుదలలో పోటీ వల్లే ప్రచారం కీలకంగా మారిందని చెప్పారు.



### సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాం: దిల్ రాజు

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం తర్వాత టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం, సినీపరిశ్రమకు మధ్య గ్యాప్ ఉందనేది అపోహ మాత్రమేనని తెలిపారు. సినీపరిశ్రమ సమస్యలను తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. బెనిఫిట్ షోలు, టికెట్ ధరలు చాలా చిన్న విషయాలని, వీటిపై చర్చ జరగలేదని తెలిపారు. హైదరాబాద్‌ను సినీపరిశ్రమకు అంతర్జాతీయ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టు తెలిపారు. సినీపరిశ్రమ, ప్రభుత్వం కలిసి పనిచేయాలని సీఎం చెప్పారని వివరించారు. హైదరాబాద్‌లో హాలీవుడ్ షూటింగ్‌లు జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని కోరినట్టు వెల్లడించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట దృశ్యాలను పోలీసులు ప్రదర్శించారన్న ప్రచారం అబద్ధమని, కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని దిల్ రాజు చిట్‌చాట్‌లో చెప్పారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో సెలబ్రిటీలు పాల్గొనాలని సీఎం సూచించారని తెలిపారు. గద్దర్ అవార్డులను ఎఫ్‌డీసీతో అనుసంధానం గురించి సూచించారని వివరించారు. బౌన్సర్ల ప్రవర్తన తీరుపై డీజీపీ తమకు చెప్పారని, ప్రతీ విషయంలోనూ బాధ్యతగా ప్రవర్తించాలని నిర్దేశించారని వెల్లడించారు.

### హాలీవుడ్ హైదరాబాద్ వచ్చేలా ప్రణాళిక

తెలుగు సినిమా పరిశ్రమకు ప్రపంచ వ్యాప్తంగా ఒక బ్రాండ్ క్రియేట్ చేయాలని నిర్ణయం తీసుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సినీ రంగానికి హైదరాబాద్ కేంద్ర బిందువుగా ఉండేలా హాలీవుడ్, బాలీవుడ్ సైతం హైదరాబాద్ వచ్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. హైదరాబాద్‌లో పెద్ద సదస్సు నిర్వహించి ఇతర సినిమా పరిశ్రమలను ఆకట్టునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సినీ పరిశ్రమ ఎదుగుదలకు దేశంలోని కాస్మోపాలిటన్ సిటీల్లో హైదరాబాద్ బెస్ట్ సిటీ అని పేర్కొన్నారు. తెలంగాణలో అవార్డులు ఇవ్వడంలేదని తెలిసి గద్దర్ పేరుతో అవార్డును ఏర్పాటు చేశామని, దిల్ రాజును ఎఫ్‌డీసీ చైర్మన్‌గా నియమించామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడైనా షూటింగ్ చేసుకుని 2 గంటల్లో హైదరాబాద్ రావొచ్చని, రాష్ట్రంలోని ఎకో టూరిజం, టెంపుల్ టూరిజాన్ని ప్రమోట్ చేయాలని కోరారు. గంజాయి, డ్రగ్స్‌తో దుష్ప్రభావాలపై సినిమా పరిశ్రమ ప్రచారం చేయాలని కోరారు.

### సీఎంకు నివేదిక: శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

చిన్న చిన్న విషయాలను సీఎం పట్టించుకోవద్దని నిర్మాత శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. సినీ పరిశ్రమ తరపున సీఎంకు తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి నుంచి వినతి పత్రం అందించామని చెప్పారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

## ఆంధ్రుల మనోభావాలను దెబ్బ తీయొద్దు

- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజ్ఞత కోల్పోయి మాట్లాడొద్దు
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరిక

మియాపూర్, డిసెంబర్ 26 : కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ రాజకీయ స్వార్థం కోసం విజ్ఞత కోల్పోయి మాట్లాడొద్దని, ఆంధ్రా ప్రజల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడితే సహించేది లేదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. ఇక్కడ నివసించేవారంతా తెలంగాణ బిడ్డలేనని, ప్రాంతాలవారీగా ప్రజలను విడదీసేలా కాంగ్రెస్ పార్టీ నేతలు వ్యాఖ్యలు చేయడం సరికాదని సూచించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. నాటి సీఎం చెన్నారెడ్డి సినీ పరిశ్రమను మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ప్రత్యేక ఆకాంక్షతో తెలంగాణ సాధించుకున్న తర్వాత తొలి సీఎం కేసీఆర్ అన్నిప్రాంతాల వారిని కండ్లల్లో పెట్టుకొని చూసుకున్నారని, ఇప్పుడు కాంగ్రెస్ నేతలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ ప్రశాంతతను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆ తర్వాత ఫుట్‌పాత్‌లపై దుకాణాలు కోల్పోయిన బాధితులు ఎమ్మెల్యే కృష్ణారావును కలువగా.. ట్రాఫిక్ ఏసీపీతో ఫోన్‌లో మాట్లాడి పేదల దుకాణాలు తొలగించవద్దని సూచించారు. బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం కేపీహెచ్‌బీ కాలనీ బస్టాప్‌లో వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందాడి శ్రీనివాస్ రావు, పగడాల శిరీష, మాజీ కార్పొరేటర్ బాబూరావు, బీఆర్‌ఎస్ నియోజకవర్గ నేత సతీశ్ అరోరా తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని యువతి ఆత్మహత్య

**తండ్రి కేసుపై స్టేషన్‌కు రప్పించారని మనస్తాపం?**

ఉప్పల్, డిసెంబర్ 26: హైదరాబాద్ నగరంలోని నాచారం పరిధిలో నివాసముండే ఓ యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. తన తండ్రి కేసు విషయంలో విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారనే తనువు చాలించిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నాచారం సరస్వతినగర్‌లో దీప్తి (29) తన తల్లితో కలిసి నివసిస్తున్నది. ఎమ్మెస్సీ చదివిన దీప్తి ఐఐసీటీలో ఉద్యోగం చేస్తున్నది. ఆమె తండ్రి సంగీతరావు ఐఐసీటీలో పనిచేసి రిటైరయ్యాడు. రెండేండ్లుగా ఆయన తన కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. వీరి ఇంటికి సమీపంలో ఉండే డీజీపీ కార్యాలయంలో పనిచేసే కానిస్టేబుల్ అనిల్ నివసిస్తున్నాడు. తన భార్య అనితకు ఉద్యోగం ఇప్పిస్తానని సంగీతరావు రూ.15 లక్షలు తీసుకున్నాడని, పలుమార్లు అడుగడంతో రూ.7 లక్షలు ఇచ్చాడని, ఇంకా ఇవ్వాల్సిన రూ.8 లక్షలను ఇవ్వడంలేదనీ నాచారం పోలీస్ స్టేషన్‌లో అనిల్ ఫిర్యాదు చేశాడు.



దీప్తి (ఫైల్)

ఈ విషయమై పోలీసులు సంగీతరావు భార్యను, ఆయన కూతురు దీప్తిని విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి దీప్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. తన తండ్రి తీసుకున్న డబ్బు విషయమై తనను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అడగడంతోనే మనస్తాపానికి గురైనట్టు తెలుస్తున్నది.

- మంత్రుల మాస్కులతో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల నిరసన



తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు (ఎస్‌ఎస్‌ఏ) చేపట్టిన సమ్మె 16వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా గురువారం వారు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట రాష్ట్ర మంత్రుల ముఖచిత్రాలతో కూడిన మాస్కులు ధరించి నిరసన తెలిపారు. – ఖమ్మం ఎడ్యుకేషన్

## విప్లవ స్ఫూర్తికి సీపీఐ ప్రతీక

- ఆ పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా రెడ్‌సెల్యూట్
- వామపక్షాల ఐక్యతకు విజ్ఞప్తి
- సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తేతెలంగాణ): 'నూరు సంవత్సరాల క్రితం వెలిగించి, భారత స్వాతంత్ర్య పోరాటంలో భాగ మై, ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చి, పాలనలో కొత్త ప్రమాణాలను నెలకొల్పిన సీపీఐ విప్లవ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందని, అలాంటి పార్టీలో తానూ భాగమైనందుకు గర్విస్తున్నా' అని ఆ పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రతి కార్యకర్తకు రెడ్ సెల్యూట్ అని పేర్కొన్నారు. సీపీఐ శబాబ్ది ఉత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఖమ్మం జిల్లాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా రాష్ట్ర కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అమరవీరులకు నివాళులర్పిస్తున్నట్టు పేర్కొన్నారు. దేశంలో సూత్రప్రాతిపదికన వామపక్షాల ఐక్యతకు ఈ సందర్భంగా మరోసారి విజ్ఞప్తి చేద్దామని, ఎర్రజెండాను ముందుకు తీసుకుపోదామని పిలుపునిచ్చారు.

## మతోన్మాదానికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు

- సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా
- 100వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ పతాకం ఆవిష్కరణ

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): దేశంలో పెచ్చరిల్లుతున్న అవినీతి, అన్యాయం, అప్రజాస్వామిక, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, వామపక్షవాదులు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా పిలుపునిచ్చారు. ఒక రాజకీయ పార్టీ వందేండ్లు పూర్తి చేసుకోవడం సాధారణ విషయం కాదని, సీపీఐ తన వందేండ్ల ప్రస్థానంలో భారత స్వాతంత్ర్య ఉద్యమం నుంచి ఇప్పటివరకు అనేక త్యాగాలు, వీరోచిత పోరాటాలు, తెగింపు ఉన్నాయని వివరించారు. సీపీఐ శత వార్షికోత్సవాలను ఈ ఏడాదిపాటు ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులను కోరారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌పై దిగజారి మాట్లాడినందుకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేసేవరకు కలిసికట్టుగా ఉద్యమించాలని కోరారు. సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో పార్టీ పతాకాన్ని అజీజ్‌పాషా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కే శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ తదితరులు పాల్గొన్నారు. అంతరాలు లేని సమసమాజం కోసం అందరూ పునరంకితం కావాలని చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలో ఏ ఒక్క రాజకీయ పార్టీ ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి వచ్చే పరిస్థితులు లేవని కే శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

### విప్లవ సంస్థల విలీనంపై తప్పుడు ప్రచారం

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తేతెలంగాణ): సీపీఐ-ఎంఎల్ న్యూడెమోక్రసీ రెండు పార్టీల విలీనంపై చంద్రం ముఠా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని, కుట్రలను తిరస్కరించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రెండు న్యూడెమోక్రసీల విలీనం కాదని, ఎస్వీ ముఠా యతీంద్రకుమార్ ముఠాతో విలీనం అవుతుందంటూ చంద్రం చేసిన వ్యాఖ్యలను ఆయన గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. చంద్రన్నకి విప్లవ జీవితంతోపాటు విప్లవేతర జీవితం ఉన్నదని, తన అక్రమాస్తుల రక్షణలో భాగంగా నాదెండ్ల బ్రహ్మయ్య హత్య జరిగిందని ఆరోపించారు. చంద్రం నాయకత్వాన్ని రెండు రాష్ట్రాల మెజార్టీ నాయకత్వం తిరస్కరించిందని చెప్పారు. డిసెంబర్ 28న రెండు విప్లవ సంస్థలు విలీనం అవుతున్నాయని తెలిపారు.

# అంతుచిక్కని మరణాలు

**సంచలనంగా మారిన ఎస్సై, కానిస్టేబుల్, సొసైటీ ఆపరేటర్ మృతి ఘటన**

- చెరువులో లభ్యమైన మూడు మృతదేహాలు
- ఒకరినొకరు కాపాడుకునే క్రమంలో మృతి చెందారా?
- లేక ఇద్దరిని చంపి మరొకరు ఆత్మహత్య చేసుకున్నారా?
- పోస్టుమార్టం తర్వాతే తేలనున్న నిజాలు: ఎస్పీ

నిజామాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి):కామారెడ్డి జిల్లాలో ఎస్సై, మహిళా కానిస్టేబుల్‌తో పాటు మరో యువకుడు మృతి చెందిన ఘటన మిస్టరీగా మారింది. ఎస్సై సాయికుమార్ (33)కు వృత్తి పరంగా మంచి జీవితం ఉంది. గర్భిణి అయిన భార్య, కుమారుడు ఉన్నారు. ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. గాంధారి మండలానికి చెందిన కమ్మరి శ్రుతి (32) 2014లో కానిస్టేబుల్‌గా ఎంపికైంది. ఆమెకు గతంలోనే విడాకులు అయ్యాయి. తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నది. బీబీపేటలో పని చేసే సమయంలో ఎస్సై సాయికుమార్‌తో శ్రుతికి పరిచయం ఏర్పడింది. బీబీపేట సొసైటీ ఆపరేటర్ నిఖిల్ (29)తో శ్రుతికి స్నేహం ఉంది. శ్రుతి కంటే వయసులో చిన్నవాడైన అతడు, ఆమెను పెండ్లి చేసుకోవాలని అనుకున్నట్టు తెలిసింది. బీబీపేట ఠాణా కేంద్రంగా ఈ ముగ్గురి మధ్య ఏర్పడిన స్నేహమే వీరి ప్రాణాల మీదకు తెచ్చిందా? ఏమిటనేది తేలాల్సి ఉంది.గురువారం మధ్యాహ్నం నుంచి ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శ్రుతి కనిపించకుండా పోయారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా వారు సదాశివనగర్ మండలం అడ్లూర్‌ఎల్లారెడ్డి పెద్దచెరువు వద్ద ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది గాలించగా బుధవారం అర్ధరాత్రి శ్రుతి, నిఖిల్ మృతదేహాలు లభ్యమయ్యాయి. గురువారం ఉదయం సాయికుమార్ మృతదేహం లభించింది.



ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శ్రుతి, నిఖిల్ (ఫైల్)

### అనుమానాలెన్నో..

ముగ్గురూ కలిసే ఆత్మహత్య చేసుకున్నారా? లేక మొదట ఎవరైనా చెరువులో దూకితే వారిని కాపాడే క్రమంలో మిగతావారు మునిగి చనిపోయారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇరువురి మధ్య ఏర్పడిన చిన్నపాటి ఘర్షణ వల్ల దాడి జరిగిందా? అన్నది స్పష్టత రావడం లేదు. సంచలనంగా మారిన ఈ కేసులో పోలీసులు ఎటువంటి స్పష్టత ఇవ్వడం లేదు.



కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలోని పోస్టుమార్టం గది వద్ద మృతుల బంధువులు

### పోస్ట్‌మార్టం రిపోర్టే కీలకం..

భిక్కనూర్ ఎస్సై, బీబీపేట మహిళా కానిస్టేబుల్ అదృశ్యంపై సమాచారం రావడంతో సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా వారున్న ప్రాంతానికి పోలీసులు చేరుకున్నారు. ఎస్సై వాహనం, ఆయన చెప్పులు పడి ఉండటంతో చెరువులో గాలించగా మొదటగా శృతి, నిఖిల్ మృతదేహాలు దొరికాయి. గురువారం ఉదయం ఎస్సై సాయికుమార్ డెడ్‌బాడీ దొరికింది. పోస్ట్‌మార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాతే నిజానిజాలు బయటపడే అవకాశాలున్నాయి.

– సింధూశర్మ, కామారెడ్డి ఎస్పీ

## డెంగ్యూతో టెన్త్ విద్యార్థి మృతి



శాలిగౌరారం, డిసెంబర్ 26 : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మరిమద్దె గ్రామానికి చెందిన విద్యార్థి డెంగ్యూతో గురువారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మనిమద్దె గ్రామానికి చెందిన జనగాం నాగరాజు, సైదమ్మ దంపతుల కుమారుడు పవన్ (16) మండలంలోని వల్లాల గ్రామ మోడల్ స్కూల్లో పదోతరగతి చదువుతున్నాడు. పవన్‌కు వారం రోజుల క్రితం జ్వరం రావడంతో తల్లిదండ్రులు నకిరేకల్‌లోని ప్రైవేటు దవాఖానలో చేర్పించారు. జ్వరం తగ్గక పోవడంతో నల్లగొండకు తరలించారు. పరీక్షించిన వైద్యులు డెంగ్యూగా నిర్ధారించి చికిత్స అందించారు. రెండు రోజుల క్రితం పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిలోఫర్ దవాఖానాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

## కర్ణాటకలో కాంట్రాక్టర్ ఆత్మహత్య

బీదర్: కర్ణాటకలోని బీదర్‌లో కాంట్రాక్టర్ సచిన్ పాంచాల్ (26) గురువారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆయన సూసైడ్ నోట్‌లో మాజీ కౌన్సిలర్ రాజు కాపనూర్, మరో ఏడుగురు తన ఆత్మహత్యకు బాధ్యులని ఆరోపించారు. ఇదిలావుండగా, రాజు కాపనూర్ కర్ణాటక గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గేకు సన్నిహితుడని తెలిసింది. ఈ వార్తపై ప్రియాంక్ ఖర్గే స్పందిస్తూ, వాస్తవాలు బయటకు రావాలని, దీనిపై దర్యాప్తునకు డిమాండ్ చేస్తున్నానని చెప్పారు. ఖర్గే కార్యాలయం తమ వాట్సాప్ గ్రూప్ లో రాజు వీడియోను పోస్ట్ చేసింది. తనను సచిన్ పెద్ద ఎత్తున మోసం చేశాడని రాజు చెప్పడం ఆ వీడియోలో కనిపించింది. ఈ నేపథ్యంలో ఖర్గే మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర ఎక్స్ పోస్ట్‌లో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొందరు మంత్రులు తమ అనుయాయులకు, సన్నిహితులకు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) రాసి ఇచ్చినట్టు కనిపిస్తున్నదని ఆరోపించారు.


## తొమ్మిది నెలలుగా జీతాల్లేవ్

- అనారోగ్యంతో కారోబార్ మృతి
- ఈ పాపం సర్కార్‌దే: సీఐటీయూ, జీపీ కార్మిక సంఘాల ఆరోపణ

పెద్దవంగర, డిసెంబర్ 26: తొమ్మిది నెలలుగా జీతాలు రాక అనారోగ్యం బారిన పడిన ఓ కారోబార్ మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం ఉప్పరగూడెంలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు బైన రవికుమార్(34) తొమ్మిది నెలలుగా జీతం రాక ఇబ్బంది పడుతున్నారు. ఇరవై రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. రవికుమార్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సైదులు, జీపీ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు కుమారస్వామి డిమాండ్ చేశారు. కార్మికులకు జీతాలు అందించి ఉంటే.. రవికుమార్ చనిపోయే పరిస్థితి ఉండేది కాదని తెలిపారు. కార్మికుడి మృతికి ప్రభుత్వం బాధ్యత వహిస్తూ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# ఇద్దరి ప్రాణాలు తీసిన ఫ్లెక్సీ

- ఏడుపాయలకు సీఎం రేవంత్ రాకతో ఫ్లెక్సీల ఏర్పాటు
- 11కేవీ విద్యుత్ వైర్లకు సమీపంలో ఉండటంతో ప్రమాదం
- బాధిత కుటుంబాలకు రూ.2కోట్ల పరిహారం ఇవ్వాలి
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

కొల్చారం, డిసెంబర్ 26 : ఫ్లెక్సీ తొలిగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం కిష్టాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. సీఎం రేవంత్ ఏడుపాయల దర్శనానికి బుధవారం రావడంతో పోతంశెట్టిపల్లి నుంచి మెదక్ వరకు జాతీయ రహదారిపై భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సీఎం పర్యటన అనంతరం సదరు కాంట్రాక్టర్ ఫ్లెక్సీలను తొలిగిస్తూ కిష్టాపూర్ వద్ద 11 కేవీ విద్యుత్తు వైర్లకు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న ఫ్లెక్సీని వదిలివేశారు. గ్రామానికి చెందిన అక్కెం యాదగిరి- భాగ్య కుమారుడు నవీన్ (21), పసుల వెంకటేశం-సుజాత కుమారుడు ప్రసాద్(20) బుధవారం రాత్రి నారుమడిలోకి అడవి పందులు రాకుండా నిప్పు వెలిగించి తిరిగి వస్తూ రోడ్డుపై ఉన్న భారీ ఫ్లెక్సీని తొలిగించే ప్రయత్నం చేశారు. ఫ్లెక్సీకి సపోర్ట్‌గా ఉన్న తాళ్లు తొలిగించడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లపై పడింది. దీంతో కరెంట్ షాక్ తగిలి ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు కొల్చారం ఎస్సై గౌస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. రైతులు పొలాలకు వెళ్లేదారిలో విద్యుత్తు వైర్లకు దగ్గరగా ఫ్లెక్సీలు పెట్టడంతోనే యువకులు మరణించారని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు రూ.2 కోట్ల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.